# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- సాంకేతిక పరిజ్ఞానం ఆసరాతో ప్రజలకు పాలనను చేరువ చేయగలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్రంలో యూరియా కొరత లేదని మంత్రి కె.అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- వచ్చే ఏడాది జూన్ నెలాఖరు నాటికి 2 లక్షలకు పైగా టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తామని మంత్రి పి.నారాయణ వెల్లడించారు.
- స్వదేశీ, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలను జీఎస్టీ సంస్కరణల ద్వారా సాధించగలమని ముఖ్యమంత్రి ప్రకటించారు.
- రాష్ట్ర వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ఈరోజు నుండి ప్రారంభమయ్యాయి.

=====================

పరిపాలనలో సాంకేతిక డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ముఖ్యమైన అంశంగా మారిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సాంకేతికతతోనే ప్రజలకు పాలనను మరింత చేరువ చేసే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (DARPG) మరియు ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (MeitY), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సు ప్రారంభ సభకు చంద్రబాబు నాయుడు ఈ రోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల ద్వారా అందే పౌర సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ లాంటి సాంకేతికత అవసరమని చెప్పారు. ఐటీ, ఈ - గవర్నెన్స్ అమలుతో పాలనలో గణనీయమైన మార్పులు వచ్చాయని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో మొత్తం 751 పౌరసేవలను వాట్సాప్ ద్వారా పౌరులకు అందిస్తున్నామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

రాష్ట్రంలో వచ్చే ఏడాది జూన్ నెలాఖరులోగా 2 లక్షల 61 వేల 640 టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. శాసన సభలో ఈ రోజు రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల పరిస్థితి, లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింత అంశంపైన పలువురు శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొత్తంగా టిడ్కో ప్రాజెక్ట్ పూర్తికి 7 వేల 280 కోట్ల రూపాయలు అవసరం అవుతుందని అంచనా వేశామని చెప్పారు. హడ్కో నుంచి 4 వేల 450 కోట్ల రూపాయల  రుణం, లబ్ధిదారులకు ఇచ్చే ఇళ్ల మీద రుణాలు ఒక వెయ్యి 725 కోట్ల రూపాయలు తీసుకుంటున్నామని వివరించారు.

=====================

రాష్ట్రంలో రైతుల కోసం 7.86 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో వ్యవసాయ రంగంపై ఈ రోజు స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలువురు శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఎరువులు, యూరియా విషయంలో రైతులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే 6.90 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని, ఇంకా 97 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని వెల్లడించారు. రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

స్వదేశీ, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలు సాకారం అయ్యేందుకు రెండవ తరం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల మీద శాసనసభలో ముఖ్యమంత్రి ఈ రోజు ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సంస్కరణల ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను మార్చటమే ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. నిత్యావసర వస్తువులలో చాలా వాటికి సున్నా శాతం పన్ను ఉందని ఆయన గుర్తు చేశారు. దీని వల్ల చిన్న వ్యాపారాలకు సైతం లబ్ధి కలుగుతుందన్నారు. అలాగే సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిస్తాయని తెలిపారు. దసరా నుంచి దీపావళి వరకూ జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రతీ ఇంటికీ తెలిసేలా ప్రచారం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

=====================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్” పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా అందరికి గృహ సదుపాయం అనే సంకల్పంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 105 సెకన్లు)

=====================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. విజయవాడ నగరంలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో అత్యంత ఘనంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల మొదటి రోజు అయిన ఈ రోజు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, దేవాదాయ శాఖా మంత్రి ఆనం

రామనారాయణ రెడ్డి, శాసనసభ్యులు సుజనా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తదితరులు కనక దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ ఏడాది అమ్మవారి దర్శనానికి సుమారు 20 లక్షల మంది వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. భక్తుల దర్శనం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. అలాగే 4 వేల 500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తుని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

======================

మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం `స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్` కార్యక్రమాలు ఎంతో దోహదపడుతుందని పార్వతీపురం మన్యం జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కెవిఎస్ పద్మావతి అన్నారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామంలో నిర్వహించిన "స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు పీహెచ్సీ పరిధిలో గల అన్ని సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.

======================

రాష్ట్రంలోని మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చే విషయంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి అసెంబ్లీలో ఈ రోజు అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

======================
======================